

రైతులూ జాగ్రత్త..! 8లో▸
త్వరలో ఖరీఫ్ సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలు, ఎరువుల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



హనుమాన్ సింధూర పూజ
ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని తిరుమలనగర్‌లో ఆదివారం హనుమాన్ సింధూర పూజ కార్యక్రమాన్ని దేవిదాస్ గురుస్వామి, ప్రభాకర్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
43.0/31.0

వాతావరణం
పగటి పూట ఎండతీవ్రత పెరగనుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు అందించాలి



మాట్లాడుతున్న వెంకటనారాయణ

ఎదులాపురం: బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు మే నెల నుంచి అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవనంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీడీ కార్మికుల వేతన పెంపుపై హైదరాబాద్‌లో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధ) రాష్ట్ర నాయకులు, బీడీ యాజమాన్య సంఘానికి మధ్య శనివారం జరిగిన చర్చలు సఫలం అయినట్లు తెలిపారు. ప్యాకర్లకు రూ.3,650, నెలసరి సిబ్బందికి రూ.1700 చొప్పున, బీడీలు చుట్టే వారికి వెయ్యి బీడీలకు రూ.4.25 పైసల చొప్పున కూలి పెంచుతూ ఒప్పందం కుదిరినట్లు పేర్కొన్నారు. పెరిగిన వేతనాలు మే నెల నుంచే అందించాలన్నారు. ఇందులో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సుభాష్, అశోక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి'

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి విడుదల చేసిన ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని ఫిజికల్ సైన్స్‌ఫోరం టీచర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్‌రెడ్డి, చంద్రశేఖర్ ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి 6, 7 తరగతులకు భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు గణితం బోధించాలని విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. 8, 9, 10 తరగతుల భౌతిక రసాయన శాస్త్రం పాఠ్యాంశాల పనిభారం దృష్టిలో ఉంచుకొని 2017లో అప్పటి విద్యాశాఖ కమిషనర్ ఆర్‌సీ నం.77 విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు జేఈఈ, ఐఐటీ, నీట్ తదితర రకాల పోటీ పరీక్షలకు రసాయన శాస్త్రం కీలకమైన సబ్జెక్టు అని పేర్కొన్నారు.

గాండ్ల సంఘం బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న సంఘం నాయకుడు

ఆదిలాబాద్‌రూరల్: గాండ్ల సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర కమిటీ బాధ్యులు భరోసా ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఆదివారం సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కులపెద్దలు పలు సమస్యలు ప్రస్తావించగా.. వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని సంఘ బాధ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆమనగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీహరి, జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిన్నంవార్ రాజేశ్వర్, తమ్మలవార్ చందు, జక్కం సంపత్, వీరసుందరం, శ్రీధర్, దత్తు, నగేశ్, విలాస్ పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ.. సల్లంగ సూడమ్మ



నల్ల పోచమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

జైనథ్: మండల కేంద్రంలో ఆదివారం నల్ల పోచమ్మ బోనాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, గాజులు, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవాలని పాడి పంటలతో పాటు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు.

అభివృద్ధి.. అసంపూర్తి!



ఇక్కడ కనిపిస్తున్నది ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌లో పట్టణ ప్రగతి నిధులు రూ.2కోట్లతో చేపట్టిన ఇండోర్ స్టేడియం. కాంట్రాక్ట్ దక్కించుకున్న గుత్తేదారు 2022 డిసెంబర్‌లో పనులు ప్రారంభించారు. పిల్లర్ల వరకు వేగంగా పనులు చేశారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో చేసేదిలేక నిలిపివేశాడు. గతేడాది జూన్ చివరి నాటికి భవన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికీ పిల్లర్ల దశ దాటకపోవడం గమనార్హం.



అసంపూర్తిగా కనిపిస్తున్న ఈ నిర్మాణం జిల్లా కేంద్రంలోని సాత్నాల క్వార్టర్స్ స్థలంలో చేపట్టిన సమీకృత మార్కెట్‌ది. చికెన్, మటన్, చేపలు వంటి మాంసహార ఉత్పత్తులన్నీ వినియోగదారులకు ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో రూ.7.20కోట్ల వ్యయంతో తలపెట్టిన ఈ నిర్మాణ పనులు 2021 డిసెంబర్‌లో ప్రారంభమయ్యాయి. జీ ప్లస్–1 అంతస్తు నిర్మాణం వరకు పనులు చేపట్టారు. అదే ఏడాది దసరాకు ప్రారంభిస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో గతేడాది పనులను నిలిపివేశాడు. ఎప్పుడు పూర్తవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

- నిధుల్లేక నిలిచిన భవన నిర్మాణాలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు
- బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- చోద్యం చూస్తున్న బల్దియా అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల దుస్థితికి ప్రతిబింబించే సాక్ష్యాలివి. కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన నిర్మాణాలు నిధుల్లేక ఇలా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. వాటి పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు మాత్రం ఇంకా పూర్తి కావడం లేదు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు కొంత మేర చేపట్టి బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. ఏళ్ల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో చేసేది లేక చేతులెత్తేశారు. దీంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయి అంసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నిర్మాణాలు పూర్తి కావాల్సిన గడువు సైతం ముగిసి ఏళ్లవుతుంది. పిల్లర్ల ఇనుప చువ్వలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ శిథిలావస్థకు చేరడం పరిస్థితికి అద్దం పడుతోంది.

ఇదీ పరిస్థితి..

వీటి నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాల్సిన బల్దియా ప్రేక్షకపాత్ర పోషిస్తుందనే విమర్శలున్నాయి. గుత్తేదారు చేపట్టిన పనులకు ఎంబీ రికార్డులు నమోదు చేసి బిల్లులను ట్రెజరీలో సమర్పిస్తున్నారు. అయితే ఆ నిధులను సర్కారు సకాలంలో విడుదల చేయకపోవడంతో గుత్తేదారుపై వారు ఎలాంటి అజమాయిషీ చేయలేకపోతున్నారు. బిల్లులు ఎప్పుడు వస్తే అప్పుడు పనులు చేస్తామనే ధోరణిలో కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు. వారు చేసినప్పుడే తాము చూస్తామనేలా అధికారుల తీరు ఉంది. ఫలితంగా భవన నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరిగి ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి. దీంతో సిమెంట్, ఇసుక, కాంక్రీట్ వంటి ముడిసరుకు ధరలు పెరిగి పనుల నాణ్యతపై ప్రభావం పడే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదలయ్యేలా చూడాల్సిన అధికారులు ఆ దిశగా చొరవ చూపడం లేదని ఫలితంగానే ఏళ్ల తరబడి నిర్మాణాలు కొనసా..గుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బిల్లులు ట్రెజరీకి పంపించాం

రూ.7.20 కోట్ల వ్యయంతో చేపట్టిన సమీకృత మార్కెట్‌కు గాను కాంట్రాక్టర్ ఇప్పటి వరకు రూ.1.25 కోట్లకు సంబంధించి పనులను పూర్తి చేశారు. ఇందులో కాంట్రాక్టర్‌కు రూ.60 లక్షలు చెల్లించాం. మరో రూ.2.85 కోట్లు ట్రెజరీకి పంపించాం. అలాగే ఇండోర్ స్టేడియానికి సంబంధించి రూ.2.24 కోట్ల వ్యయంతో చేపట్టగా రూ.45 లక్షల పనులు పూర్తయ్యాయి. ఈ బిల్లులను సైతం ట్రెజరీకి పంపించాం. అక్కడ పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి సైతం నివేదించాం.

– తిరుపతి, మున్సిపల్ ఇంజినీర్

బడి బస్సు భద్రమేనా?



- జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- బస్సుల కండీషన్‌పై అనుమానాలు
- కాలం చెల్లిన వాహనాలతో విద్యార్థులకు ప్రాణసంకటం
- పట్టించుకోని అధికారులు
- ఇంకా షురూ కాని తనిఖీలు

జిల్లాలో పాఠశాలలు : 1,439
మొత్తం విద్యార్థులు : 1.60లక్షలు
ప్రైవేట్ పాఠశాలలు: 167
విద్యార్థులు : 40వేలు
స్కూల్ బస్సులు : 135

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో బడి బస్సులు ఎంతవరకు భద్రమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యార్థులను తీసుకెళ్లాల్సిన ప్రైవేట్ బస్సుల కండీషన్ ఆందోళనకు గురి చేస్తుంది. కాలం చెల్లిన వాహనాలను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్సుల సామర్థ్యాన్ని పరిశీలించాల్సిన సంబంధిత శాఖ అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదనే ఆరోపణలున్నాయి. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బడి బస్సులను సిద్ధం చేసుకోవాల్సిన యాజమాన్యాలు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. జిల్లా పరిధిలో 135 వరకు స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటిలో దాదాపు అన్నింటి ఫిట్‌నెస్ ముగిసింది. సుమారు రెండు నెలలుగా మూలన ఉండడంతో ఇవి కండీషన్‌లో లేనట్టు తెలుస్తోంది. వీటిని తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. రవాణాశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 167 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 40వేల మంది వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో సగానికిపైగా స్కూల్ బస్సుల్లోనే రాకపోకలు కొనసాగిస్తుంటారు. 123 ప్రైవేట్ పాఠశాలలకు మొత్తం 135 బస్సులు ఉన్నాయి. వీటికి మే 15 నాటికి ఫిట్‌నెస్ గడువు ముగిసింది. అలాగే దాదాపు అన్ని బస్సులకు ఇన్సూరెన్స్ సైతం ముగిసినట్లు తెలుస్తోంది.

నిబంధనలు తప్పనిసరి..

మరి కొద్దిరోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో బడి బస్సు భద్రత నిబంధనలు తప్పనిసరి పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. బస్సులో సీట్లు, అద్దాలు, టైర్లు, తదితర బస్సు సామగ్రి అన్ని సక్రమంగా ఉన్నాయా.. లేదా.? అనేది చూసుకోవాలని సూచిస్తున్నారు. స్కూల్ బస్సులకు సంబంధించి 32 అంశాలతో కూడిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించొద్దు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి. వాహనం 15 సంవత్సరాలు మించి నడపరాదు. బస్సులో విద్యార్థుల వివరాల పట్టిక నమోదు చేసి ఉంచాలి. అయితే జిల్లాలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా చాలా పాఠశాలలు కండీషన్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్నారు. దీంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రవాణా శాఖ అధికారులు పాఠశాలల పునఃప్రారంభం అయిన తర్వాత వారం పాటు మాత్రమే తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి వదిలిపెట్టడం విమర్శలకు తావిస్తోంది.

నిబంధనలు పాటించాలి..

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి. బస్సుల ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేయించాలి. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు రోడ్డు పైకి వస్తే సీజ్ చేస్తాం. అలాగే గడువు ముగిసిన వాటిని కూడా నడుపరాదు. డ్రైవర్లకు, యాజమాన్యాలకు శిక్షణ నిర్వహిస్తాం. సేఫ్టీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం.

– శివపెల్లి శ్రీనివాస్, జిల్లా రవాణాశాఖ అధికారి

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

- ఐక్యతతోనే గ్రామాల అభివృద్ధి
- ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్
- నార్నూర్‌లో శాంతి కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్

నార్నూర్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని, చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్నా ఉపేక్షించేది లేదని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ వర్గాల పెద్దలతో ఆదివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ మండలాలైన జైనూర్, నార్నూర్, ఉట్నూర్ వంటి ప్రాంతాల్లో వ్యక్తిగత గొడవలైనప్పటికీ, కొంతమంది రెండు వర్గాల మధ్య గొడవగా సృష్టిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. అందరూ సోదరాభావంతో కులమతాలకతీతంగా కలిసిమెలిసి ఉంటే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో సీఐ రహీంపాషా, గాదిగూడ ఎస్సై మహేశ్ కుమార్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు జ్ఞానోబా పుష్కర్, సర్పంచ్ గజానంద్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, మైనార్టీ పెద్దలు జాక్రుల్లా ఖాన్, సత్తార్, హసన్‌ఖాన్, బాబాఖాన్, ఆటోడ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కప్పర్లలో ఓ ఇంటిపై విరిగిపడిన చెట్టు



బోథ్‌లో విద్యుత్ తీగలపై పడిన చెట్టు కొమ్మ

గాలివాన బీభత్సం

తాంసి మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో చెట్లు విరిగిపడగా, ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. కప్పర్లలో ఓ ఇంటిపై వేపచెట్టు విరిగిపడింది. హస్నాపూర్‌లో పలు ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోయాయి. పొన్నారి శివారులో 33కేవీ విద్యుత్ లైన్‌లో స్తంభం ఇన్సులేటర్ విరిగిపోగా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. సిబ్బంది రాత్రిపూట వాటిని తొలగించి కరెంట్ సరఫరా పునరుద్ధరించారు. బోథ్ మండలంలోని హనుమాన్‌నగర్‌లో పలు ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోయాయి. ఓ ఇంటి గోడ కూలిపోయింది. మండల కేంద్రంలో విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మ పడింది.

– తాంసి/బోథ్



రాత్రి వేళలో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెన్‌గంగ నది వద్ద ఇసుక అక్రమ తరలింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బేల: పెన్‌గంగలో ఇసుక అక్రమ దందాపై ఈ నెల 24, 25, 26 తేదీల్లో 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలపై జిల్లా మైనింగ్ శాఖ ఎట్టకేలకు స్పందించింది. మండలంలోని కాంగార్‌పూర్ గ్రామ శివారులో గల పెన్‌గంగ క్వారీ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను మైనింగ్‌శాఖ టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్ పవార్ ఆదివారం పట్టుకున్నారు. వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైనింగ్‌శాఖ ఏడీకి నివేదించినట్లు ఆయన తెలిపారు. అయితే ముందస్తు సమాచారంతో ఇసుక తోడుతున్న ప్రత్యేక మిషన్, టిప్పర్లను ఇసుకాసురులు అక్కడి నుంచి తప్పించినట్లు వినికిడి. సమీపంలోని శ్మశానవాటిక వైపునకు తరలించి అధికారుల కంటబడకుండా దాచిపెట్టారని సమాచారం.



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో టీఏ రమేశ్ పవార్

అనుమతి లేకుండా ఫ్లెక్సీలు

- బల్దియాకు ఆర్థిక నష్టం
- ప్రకటనలకే పరిమితమైన రూ.5వేల జరిమానా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన చౌక్‌ల్లో కొంత మంది రాజకీయ, యువజన, కుల, ప్రజాసంఘాల నాయకులు జన్మదిన, వివిధ పండుగలకు శుభాకాంక్షలు తెలుపుతూ బల్దియా నుంచి అనుమతి లేకుండా ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్టీఆర్‌చౌక్, అంబేడ్కర్‌చౌక్, వినాయక్ చౌక్, వివేకానంద చౌక్, పంజాబ్‌చౌక్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాటిని హోర్డింగ్‌లకు ఏర్పాటు చేయకుండా పట్టణ సుందరీకరణలో భాగంగా బల్దియా ఏర్పాటు చేసిన రెయిలింగ్‌లకు వైర్లతో కడుతున్నారు. దీంతో ఈదురుగాలుల తీవ్రతకు ఆ ప్రచార ఫ్లెక్సీలు కూలిపోవడంతో రెయిలింగ్‌లు విరిగిపోతున్నాయి. ఫలితంగా బల్దియాకు ఆర్థికనష్టం వాటిల్లుతోంది. ఇటీవల ఓ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ ఈదురుగాలుల తీవ్రతకు రెయిలింగ్ విరిగి కిందపడింది. ఆ సమయంలో అటుగా వెళుతున్న ఓ వాహనదారుడిపై పడే అవకాశముండగా తృటిలో ప్రమాదం తప్పింది. అయినా బల్దియా అధికారులు మౌనం వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనధికారికంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే రూ.5వేల జరిమానా విధిస్తామనే బల్దియా అధికారుల మాటలు ఆచరణలో కనిపించడం లేదు. ఇప్పటికైనా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఎన్టీఆర్‌చౌక్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కారణంగా విరిగిన రెయిలింగ్

క్లుప్తంగా

ఆలయంలో చోరీ



పగులగొట్టిన హుండీ

లోకేశ్వరం: మండలంలోని హద్గాం గ్రామంలోని మల్లన్న దేవుని ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది.ఆదివారం ఉదయం పూజ కోసం వెళ్లినవారు చోరీ జరిగిందని గ్రామస్తులకు సమాచారం అందించారు. హుండీ తాళం పగులగొట్టి డబ్బులను ఎత్తుకెళ్లారని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టపగలే దోపిడీ



బార్ సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల కల్పన బార్ వద్ద శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో దోపిడీ జరిగింది. బేల మండలానికి చెందిన మెస్రం కైలాస్ మద్యం సేవించేందుకు బార్‌కు వచ్చాడు. అతని వద్ద డబ్బులు ఉన్నాయని గమనించి ఓ దొంగ మరో ముగ్గురు దొంగలకు సమాచారం అందించారు. వారు ఆటోలో అక్కడికి చేరుకున్నారు. బార్ నుంచి బయటకు కైలాస్‌ను ఆటోలో ఎక్కించేందుకు ప్రయత్నించారు. ఆయన ససేమిరా అనడంతో దాడి చేసి రూ.10 వేల నగదు లాక్కొని ఆటోలో పరారయ్యారు. బార్‌కు సంబంధించిన సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌లోని చోరీకి గురైన రాగి వైరు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేసి అందులో రాగి వైర్లను చోరీ చేశారు. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైరు, ఇతర వస్తువుల విలువ రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు ఉంటుందని శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ మామిడి గంగవ్వ, సభ్యులు విద్యుత్ ఏఈ శివప్రసాద్‌లు ఆదివారం స్థానిక ఎస్సై రాజుకు ఫిర్యాదు చేశారు.

మరో వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌లో నకిలీ విత్తనాల విక్రయాల్లో పట్టుబడ్డ ముఠాలో మరో వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. సిద్దిపేటకు చెందిన మణికంఠ పరారీలో ఉండగా, ఆదివారం పట్టుకున్నామన్నారు. ఇదివరకే ఈ కేసుతో సంబంధం ఉన్న ఇద్దరిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

రైతులూ జాగ్రత్త..!

- విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం
- కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- గుర్తింపు పొందిన విత్తనమే మేలు

జిల్లాల వారీగా..

జిల్లా	సాగు విస్తీర్ణం
మంచిర్యాల	3.42 లక్షలు
ఆదిలాబాద్	5.56 లక్షలు
నిర్మల్	4.30 లక్షలు
కుమురంభీం ఆసిఫాబాద్	4.80 లక్షలు



బస్తాల్లో పలు కంపెనీల పత్తి విత్తనాల ప్యాకెట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్/నేరడిగొండ: మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయం దగ్గరపడింది. ఈ సమయంలో పలు కంపెనీల విత్తనాల, పురుగుల మందుల ప్రచారం జోరుగా ఊపందుకుంది.పుట్టగుడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలు సాగిస్తున్నాయి. కంపెనీల యాజమాన్యాలు ఉమ్మడి జిల్లాలోని డీలర్లకు ప్యాకేజీలు, విదేశీ టూర్ల ఆఫర్ చేస్తున్నాయి. పత్తి విత్తనాలకు సంబంధించిన కంపెనీలు ఆయా గ్రామాల్లో రైతులను ఆకట్టుకునేలా వాహనాల్లో వచ్చి కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. మైక్‌సెట్ ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్లకు చేరుతున్నాయి. ఆయా కంపెనీల వలలో రైతులు మోసపోకుండా అప్రమత్తండా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఆకర్షణీయ ప్రకటనలకు లోనుకావద్దు

ఆయా కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు లోబడి విత్తనాలు కొనుగోలు చేయరాదు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో..గుర్తింపు లేని లేబుల్‌తో కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలు రైతులకు అంటగడుతున్నాయి. కంపెనీలపై విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్ని సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. విత్తన కంపెనీపై ప్రభుత్వ నిబంధనల వివరాలు ఉన్నాయో జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా విత్తనాల్ని ఉత్పత్తి చేసే కంపెనీపై నమ్మకం ఉండాలి.

నాణ్యమైన విత్తనాలు కొనాలి

ప్రభుత్వ లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్న విత్తనాల రసీదు తమ వద్ద పెట్టుకోవాలి. బీటీ–3 పేరిట నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు.

– సురేఖ, మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి

విత్తనాలు కొనేముందు..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన ఆధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి
- బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనవద్దు.
- విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యేంత వరకు భద్రపర్చాలి
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనే ముందు..

- ఆధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

పురుగు మందు కొనే ముందు..

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందు కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు.
- వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించొద్దు.

కళ్లు కనిపించకపోయినా..





హార్మోనియం, తబలా వాయిస్తున్న పాపయ్య

- సంగీత వాయిద్యంలో దిట్ట
- రాణిస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాపయ్య

కుంటాల: జీవితంలో ఏదైనా సాధించాలన్న తపన.. సమాజంలో ఏదో ఒకటి సాధించాలన్న లక్ష్యం వారిలో ఉంటుంది. కళ్లు లేకపోయినా తబలా, హార్మోనియం వాయిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. సంకల్పానికి అంగవైకల్యం అడ్డురాదని నిరూపిస్తున్నారు కుంటాల మండలం అంబకంటి గ్రామ వాసి రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపు పాపయ్య.

విద్యార్థి దశ నుంచే..

గజ్జవ్వ–గజ్జన్నల దంపతుల కుమారుడు పాపయ్య. సుమారు మూడేళ్ల వయస్సులో పోచమ్మ (అమ్మవారు) సోకడంతో రెండు కళ్లు కోల్పోయాడు. గ్రామానికి చెందిన దివంగత పోతన్‌రావు సహకారంతో హైదరాబాద్ వెళ్లాడు. పాతబస్తీ సాలార్జంగ్ మ్యూజియం బసంత హవేలీ అంధుల పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించాడు. బ్రెయిలీ విధానం ద్వారా విద్య నేర్చుకున్నాడు. పాఠశాలలో సంగీతం, ఆటలు, వ్యాయామం తరగతులు నిర్వహించేవారు. శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకున్న పాపయ్య తబలా, హార్మోనియం వాయించడంలో ప్రావీణ్యం పొందాడు. చంచల్‌గూడ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశాడు. బిస్కెట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ డిగ్రీ చదువుకునే సమయంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడిగా 1985లో టీటీసీలో అర్హత సాధించాడు.

తనదైన శైలిలో బోధన

అంధుల పాఠశాలలో బ్రెయిలీ లిపి నేర్చుకుని పాపయ్య టీచర్‌గా 37 ఏళ్లపాటు విద్యాబోధన అందించారు. విద్యార్థులకు భాష, ఉచ్చరణ, పరిజ్ఞానం పెంపొందించాలన్న లక్ష్యంతో తనదైన శైలిలో బోధనకు రూపకల్పన చేశాడు. పాఠ్యాంశాల్లోని వరుసలను విద్యార్థులతో చదివించేవాడు. అదివిన్న తర్వాత వారికి అర్థమయ్యేలా బోధించడం ద్వారా ప్రత్యేకత చాటుకున్నారు.

ఇంపైన సంగీతం

తనకు కళ్లు లేకపోయినా..తను నేర్చుకున్న కళలతో ఇతరులకు ఇంపైన సంగీతాన్ని అందిస్తున్నారు. పాపయ్య తన స్నేహితులతో కలిసినప్పుడు, ఇంట్లో జరిగే శుభకార్యాలలో తబలా, హార్మోనియం వాయించడంతో అది విని, చూసిన పలువురు మంత్ర ముగ్ధులవుతున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా తనకంటూ ప్రత్యేకత చాటుతూ ముందుకు సాగుతున్న పాపయ్యను పలువురు అభినందిస్తున్నారు.

లక్ష్యంతో ముందుకెళ్లాలి



ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు బోధన చేయడం సంతృప్తినిచ్చింది. జీవితంలో సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్లాలి. తబలా, హార్మోనియం చక్కగా వాయించడంతో అందరూ అభినందించడం సంతోషంగా ఉంది.

– గోపు పాపయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, అంబకంటి

ఇలేగాంలో అగ్నిప్రమాదం

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఊరి పక్కనున్న చెరువు ఎండిపోయింది. ఆదివారం అందులో ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలకు నిప్పంటుకుని పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. గ్రామస్తులు అందించిన సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు.



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

పొట్టపెల్లి(కె)కి తప్పిన ప్రమాదం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

- వరిగడ్డికి నిప్పుపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు
- క్షణాల్లో వ్యాపించిన మంటలు
- మంటలార్పిన యువకులు, అగ్నిమాపక సిబ్బంది



పొట్టపెల్లి(కె) వద్ద అలుముకున్న పొగ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామానికి పెను ప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని వరిగడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. గాలి వేగానికి క్షణాల్లో మంటలు గ్రామ సమీపం వరకు వ్యాపించాయి. బీసీ కాలనీకి పది అడుగుల దూరం వరకు మంటలు వచ్చాయి. ఇళ్లకు నిప్పు అంటుకుంటుందని పలువురు యువకులు, పెద్దలు ధైర్యం చేసి చెట్లకొమ్మలు, బిందెలు, బకెట్లలో నీటితో మంటలార్పేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకున్నారు. యువకులు, గ్రామస్తుల సహాయంతో మంటలార్పేందుకు చర్యలు చేపట్టారు. దాదాపు 2 గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. కాగా, అగ్ని ప్రమాదంతో పలువురు రైతులకు చెందిన వరిగడ్డి దగ్ధమైంది. దాదాపు రూ.30 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది ఏఎస్సై అశోక్ కుమార్, డ్రైవర్ ఆపరేటర్ హుస్సేన్, ఫైర్‌మెన్‌లు అజయ్ కుమార్, రాజు, ఏఎస్సై నారాయణరెడ్డి, పీసీలు అశోక్, తదితరులు ఉన్నారు.

ఉద్యోగం లేదని మనస్తాపంతో ఆత్మహత్య

- పిప్పల్‌కోటిలో ఘటన
- కేసు నమోదు



నిఖిల్ (ఫైల్)

తాంసి: డిగ్రీ చదివినా ఎలాంటి ఉద్యోగం లేదని మనస్తాపంతో యువకుడు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో ఈ ఘటన చోటు చేసుకుంది. తాంసి ఎస్సై శివరాం కథనం ప్రకారం.. పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన తోన్పు నిఖిల్ (24) డిగ్రీ చదివాడు. కొన్నినెలలుగా ప్రైవేట్ ఫర్టిలైజర్ కంపెనీలో పనిచేశాడు. ఈ సంవత్సరం ఉద్యోగం పోవడంతో ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పని చేస్తున్నాడు. ఉద్యోగం లేదని నిఖిల్ బాధపడేవాడు. ఈ క్రమంలో శనివారం ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. బంధువులకు ఫోన్ చేసి ఆరాతీశారు. ఈక్రమంలో తాంసి మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్టు వద్ద యువకుడి బైక్‌తోపాటు చెప్పులు వదిలేసి ఉండడాన్ని స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని కుటుంబీకులకు సమాచారం అందించారు. రాత్రి కావడంతో ఆదివారం ఉదయం గజఈతగాళ్లతో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఎస్సై పరిశీలించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. తండ్రి విశ్వనాథ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



లక్ష్మి

సోన్: గుర్తుతెలియని పురుగుల తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని బొప్పారం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బద్దం లక్ష్మి (33), రాజు భార్యభర్తలు. భర్త తన మాట వినడం లేదని, తోటలోకి సరిగా పనికి రావడం లేదని మనస్థాపం చెందింది. బుధవారం మధ్యాహ్నం లక్ష్మి గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి సాయిరెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం



కడెం: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 1996-97 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కొండుకూర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాల జ్ఞాపకాలు, మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బాగులవాడ శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక దివ్య గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రజతోత్సవ వేడుకలు చేపట్టారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.





లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-97 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన అపూర్వ సమ్మేళనానికి వారు పాల్గొన్నారు. చిన్ననాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. గురువు లింగారావు దంపతుల పెళ్లిరోజు సందర్భంగా దుస్తులు అందజేశారు. గురువులు గంగారెడ్డి, గంగన్న, లింగారావు, సుధీర్‌కుమార్, పద్మాకర్‌రావు, కమల, రాజేశ్వర్, శ్రీనివాస్, మోహన్‌రావు, ద్రుపతి, రమేశ్, ముత్యం, అపర్ణ, నరేందర్‌రెడ్డి, గంగన్నను సన్మానించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి



కదం ప్రీతి(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బి) బైపాస్‌రోడ్ ఎన్‌టీ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కదం ప్రీతి(31) మృతి చెందారు. మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తుండగా, రెండేళ్లుగా పట్టణంలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఈక్రమంలో ఆమె అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం మృతిచెందారు. దీంతో ఉపాధ్యాయవర్గాలు ఆమె మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కోతిదాడిలో మహిళకు గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో కోతి ఓ మహిళపై దాడి చేసి గాయపర్చింది. ఇంటి ఆవరణలో జ్యోతి పని చేసుకుంటుండగా, ఆదివారం వానరం దాడి చేసింది. దీంతో ఆమె చేతికి గాయమైంది. అలాగే మరో ఇద్దరిపై దాడి చేయగా, వారికి గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రిలో వారికి ప్రథమ చికిత్స అందించారు. కోతుల బెడద నుంచి కాపాడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఠాకూర్ హోటల్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వడదెబ్బ, మూర్ఛ వ్యాధితో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు 35 వరకు ఉంటుందని వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఆవులు మృతి

తాంసి/తలమడుగు: తలమడుగు మండలం లింగి శివారు పొలంలో ఆదివారం రెండు ఆవులు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయి. మేత కోసం ఆవులు వెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.50 వేల వరకు ఉంటుందని తాంసి మండలం గిరిగాం గ్రామానికి చెందిన బాధిత రైతులు విలాస్, జ్ఞానేశ్వర్ తెలిపారు. అధికారులు పరిహారం అందించాలని కోరారు.